క్లుప్తంగా

ఆక్స్‌ఫర్డ్ శాట్ పరీక్షకు విశేష స్పందన

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డె న్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ–నీట్ అకాడమీ ఆధ్వ ర్యంలో ఆదివారం నిర్వహించిన స్కోలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఓ–శాట్)కు మూడు వేల మంది విద్యార్థులు హాజరైనట్లు ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.విజయభాస్కర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలను డిసెంబర్ రెండో తేదీన విడుదల చేసి, ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు



గుంటూరు వెస్ట్(క్రీడలు): వేణు బ్యాడ్మింటన్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన 40+ డబుల్స్ పోటీలో విజేతగా డాక్టర్ రవికుమార్, మిత్ర, రన్నర్స్‌గా ఎస్.సుబ్బారావు, ఏసోబు, తృతీయ స్థానంలో వెంకట కృష్ణ, రాజు నిలిచి నట్లు కోచ్ వేణు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు కళ్లం హరనాథ్‌రెడ్డి లిమిటెడ్ ఎండీ పి.వేణు గోపాల్ రెడ్డి, శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ పార్టనర్ మహేష బాబు బహుమ తులు అందజేశారు.

డ్రెయిన్ల పూడిక తీత పనులు చేపట్టాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని అంతర్గత డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలని నగర పాలక సంస్థ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కమిటీ సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులను కోరారు. శనివారం కమిటీ సభ్యులు నాజ్ సెంటర్ ఎల్ఎ ల్ఆర్ రిజర్వాయర్‌లో ఇంజినీరింగ్ అధికా రులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పను లపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రధాన డ్రైన్లలో పూడిక తీయాలని, లేకుంటే మురుగు నిలిచి ప్రజారోగ్యానికి భంగం కలుగుతుందన్నారు. దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజారోగ్య సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో క్లోరిన్‌ను తగు మోతాదులో కలపాలన్నారు. నగరంలో జరుగుతున్న రోడ్లు, డ్రైన్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిం చేలా ఎమినిటి కార్యదర్శుల ద్వారా పర్యవేక్షణ చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇం జినీరింగ్ సూపరింటెండెంట్ పీవీకే భాస్కర్ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ ఇప్పటికే డ్రెయిన్ల శుభ్రం చేయడానికి నాలా క్లీనింగ్ మెషిన్లు అందుబాటులోకి వచ్చాయని త్వరలో అన్ని డ్రెయిన్లు శుభ్రం చేయుటకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులు సూచించిన అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ సుందర్రా మిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, అభివృద్ధి పనుల పర్యవేక్షణ కమిటి సభ్యులు పరంధామయ్య, జోగారావు, నారాయణ రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

శాలివాహనులు ఐక్యంగా పోరాడాలి



గుంటూరు వెస్ట్: రాష్ట్రంలో శాలివాహనులు ఐక్యంగా ఉండి పోరాడాలని అఖిల భారత శాలివాహన సంఘం నాయకుడు శివకుమార్ చౌడా షెట్టి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక నల్లపాడు రోడ్డులో ఏపీ కుమ్మరి, శాలివాహన సంఘం ఉమ్మడి జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో ఏటా కనీసం రూ.500 కోట్లు కేటాయించేలా పోరాడాల న్నారు. కులగణలో శాలివాహనులంతా తమ కులాన్ని, వివరాలను నమోదు చేయించుకుని తమ సంఖ్యను ప్రభుత్వాలకు తెలియజేయాల న్నారు. మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెకయ్య మాట్లాడుతూ కుల వృత్తులను నమ్ముకుని జీవి స్తున్న శాలివాహనులకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనందించి ఆదుకోవాలని కోరారు. సబ్సిడీపై రుణాలు అందించాలన్నారు. కార్య క్రమంలో రాజవరపు రవి, ఐలాపురం భాస్కర శ్రీనివాసరావు, ఇందుర్తి శివన్నారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం కార్తిక పౌర్ణమి సంద ర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన దీపోత్సవం, జ్వాలా తోరణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను ఊరేగించిన అనంతరం ప్రత్యేక హారతులు ఇచ్చారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దాం



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివ జ్యోతి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యా వంతులుగా ఎదగాలని ప్రభుత్వ బాలికల జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గర్నెపూడి సునీత పేర్కొన్నారు. ఆదివారం సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రాజ్యాం గ ఆమోద దినోత్సవం సందర్భంగా విద్యార్థిను లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సునీత మాట్లాడుతూ రాజ్యాంగం గొప్పతనాన్ని, రాజ్యాం గంలో పొందుపరిచిన ముఖ్యాంశాలను, సమాజం పై యువత బాధ్యతను వివరించారు. బడుగు, బలహీనవర్గాలు విద్యను ఆయుధంగా చేసుకుని సమాజంలో ఉన్నతస్థాయికి ఎదగాలని అంబేడ్కర్ ఆకాంక్షించారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో నడచి, రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడాలని అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థినులచే రాజ్యాంగ ప్రవేశికను చదివించి, భారత రాజ్యాంగ పీఠిక రాసే ఛాలెంజ్ పోటీను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం కో–ఆర్డినేటర్ మాధవీలత, అధ్యాప కులు కేఎస్ శ్రీనివాసరావు, జయశీల, వి.అనూ రాధ, బీజే రామారావు, వై.సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గర్నెపూడి సునీత

రాజ్యాంగంతోనే సమాన హక్కులు

నెహ్రూనగర్: బ్రిటీషర్ల పాలనలో దోపిడీకి గురై అస్తవ్యస్తమైన భారతావనిని స్వాతంత్ర్య అనం తరం ఏకతాటిపైకి నడిపించడంలో రాజ్యాంగం కీలక భూమిక పోషించిందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.శివ లక్ష్మీ జ్యోతి అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవ సందర్భంగా నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అంబే డ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం లభించిన రెండేళ్ల తర్వాత రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26 నాటి రాజ్యాంగ పరిషత్‌లో ఆమోదించి, 1950 జనవరి 26 నుంచి భారత రాజ్యాంగం అమలు చేసుకుం టున్నామని, ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాం గాల్లో భారత రాజ్యాంగం ప్రధాన స్థానంలో ఉం టుందని చెప్పారు. అనంతరం రాజ్యాంగ ప్రవే శికను చదివారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిష నర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ వ్యవ స్థాపక అధ్యక్షులు ఏసుబాబు తెలిపారు. ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప గొప్ప మేధావులు యొక్క ఆలోచనలు అనేక దేశాల యొక్క రాజ్యాంగాలను సమీకరించి రూపొందించిన ఈ భారత రాజ్యాంగం చాలా గొప్పదన్నారు.

ప్రాంతీయ గ్రంథాలయంలో..

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్ర రాజ్యాంగాన్ని రూపొందించిన ఘనత బీఆర్ అంబేడ్కర్‌కే దక్కు తోందని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయాధికారి ఎస్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రాంతీయ గ్రంథాల యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భం గా పాఠకులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అం బేడ్కర్‌ను స్మరించుకోవాల్సిన బాధ్యత మనంద రిపై ఉందన్నారు.

క్రిస్టియన్‌పేటలో..

నెహ్రూ నగర్ : అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణం గా దళిత బహుజనులు ముందుకు సాగాలని దళిత నాయకులు కోరారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా పాత గుంటూరు క్రిస్టి యన్ పేట లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు గుడిమెట్ల ఇస్సాకు, బోరుగడ్డ రాజేష్ కుమార్, చిలకాబత్తిని విజయ్ కుమార్, బోరుగడ్డ మహేష్, జ్యోతుల జస్వంత్ పాల్గొన్నారు.

మినీ అంబేడ్కర్ భవన్‌లో..

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గీతం విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ పారా రమేష్ తెలిపారు. ఆదివారం అరం డల్ పేట మినీ అంబేడ్కర్ భవన్‌లో భీమ్ భారత్ ఏర్పాటు చేసిన రాజ్యాంగ మహోత్సవ సభకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికి అందించడానికి అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారన్నారు. భీమ్ భారత రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ రాజ్యాం గం ద్వారా దేశ పౌరులకు సమాన హక్కులు కల్పిం చి మనిషిని మనిషిగా గౌరవించాల్సిన సమాజంలో కొన్ని శక్తులు కొన్ని వర్గాల ప్రజలపై అసమానతలు సృష్టించి రాజ్యాంగానికి ఉన్న ప్రాముఖ్యతను తగ్గిం చి మనుధర్మ సిద్ధాంతాన్ని ప్రజలపై రుద్దాలనే ఉద్దే శంతో పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. సమావేశంలో నాగార్జున యూనివర్సిటీ అసోసి యేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వసంతరావు, దళిత మహా సభ రాష్ట్ర నాయకులు కొండపల్లి విల్సన్, బత్తుల విల్సన్, అనిల్ పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: రాజ్యాంగ రచనలో పొందుపరచిన రక్షణాలే అంతర్జాతీయ సమాజంలో భారత దేశాన్ని అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా నిలబె ట్టాయని సీనియర్ ఇంజనీర్ ఎన్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం భారత రాజ్యాం గ ఆమోద దినోత్సవం నిర్వహించారు. అనంతరం సంస్థ సభ్యులు న్యాయవాది అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ప్రసంగించారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న గ్రంథాలయాధికారి వెంకటేశ్వరరావు



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

టెన్నిస్ పోటీల్లో మెడల్ సాధించిన డాక్టర్ వై.షేక్‌కు సత్కారం

లక్ష్మీపురం: గుంటూరు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాల జిస్ట్ డాక్టర్ వై.షేక్ ఇటీవల విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఇండి యన్ మెడికల్ అసోసియేషన్ నేషనల్ డాక్టర్స్ ఒలం పియాడ్- 2023 టెన్నిస్ డబుల్స్‌లో రన్నర్స్‌గా సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయం అని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదిఖానాలో ఆదివారం డాక్టర్ వై.షేక్‌కు అభినం దన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వై.షేక్ అన్ని వర్గాల వారికి ఎంతో సహాయం చేసే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అన్నారు. అనంతరం డాక్టర్ వై.షేక్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరి ధర్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, వక్ఫ్‌బోర్డు చైర్మన్ జిలాని, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దేవానం ద్, కార్పొరేటర్లు రోషన్, విశ్రాంత ఎక్సైజ్ కమిషనర్ అహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.



డాక్టర్ వై.షేక్‌ను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి, మద్దాళి గిరిధర్

కాలం కవుల చేతుల్లో బందీ

మాజీ మంత్రి డొక్కా

పాత గుంటూరు: కాలాన్ని శాసించగల శక్తి కవులకే ఉందని, కాలం కవుల చేతిలో మాత్రమే బందీగా ఉంటుందని మాజీ మంత్రి, జాషువా కళాపీఠం అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. బ్రాడీపేటలోని కొరటాల భవన్‌లో ఆదివారం బాపు– రమణ– బాలు కళాపీఠం– నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లాశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ రమణ యశస్వి రచించిన 'యశస్వీయ సప్తపదులు' పుస్తకావిష్కరణ, కవిమిత్రుల సంగమం– కవి సమ్మేళనం నిర్వహించారు. డొక్కా మాట్లాడుతూ కాలాన్ని తన గుప్పిటలోకి తెచ్చుకుని వైద్యుడిగా, సాహితీవేత్తగా రెండు పాత్రలను ఏకకాలంలో పోషిస్తున్న విశిష్ట వ్యక్తి డాక్టర్ రమణ యశస్వి అన్నారు. లఘు కవితా ప్రక్రియల ఉద్యమకారుడు, ప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు 'సప్తప దులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో మినీ కవితా ప్రక్రియలపాత్ర కీలకమైందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు మాట్లాడుతూ నేడు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు, పరిణామాలు వస్తున్నాయని చెప్పారు. ఇవి చాలా అవసరమని వివరించారు. సాహిత్యంలో మార్పు అనివార్యం, మంచి మార్పు సాహిత్యాన్ని పదికాలాలు సజీవంగా ఉంచుతుందని అభిప్రాయ పడ్డారు. ప్రసిద్ధ కవి కోసూరి రవికుమార్ పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, సాహితీవేత్తలు డాక్టర్ పీవీ సుబ్బారావు, వైహెచ్‌కే మోహన్‌రావు, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. పుస్తక రచయిత డాక్టర్ రమణ యశస్వి నూతన కవితా ప్రక్రియ ఉద్దేశాన్ని తెలిపారు. అనంతరం బి.జనార్ధనరెడ్డి నిర్వహించిన కవి సమ్మేళనంలో మూడు జిల్లాలకు చెందిన కవులు తమ కవితల్ని వినిపించారు. చిలకలూరిపేటకు చెం దిన పి.వి.రమణకుమార్ చదివిన కవితను ఉత్తమ కవితగా ఎంపిక చేసి నగదు బహుమతి, సర్టిఫికెట్, శాలువతో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ సత్కరించారు. సయ్యద్ జానీబా షా, బండికల్లు జమదగ్ని నిర్వహించారు.



పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

కార్తిక వన సమారాధనలతో ఆధ్యాత్మికత, సమష్టి భావన

అదనపు సొలిసిటర్ జనరల్ జూపూడి యజ్ఞదత్

గుంటూరు ఎడ్యుకేషన్: కార్తిక వన సమారాధన లతో ఆధ్యాత్మికతతో పాటు సమష్టిగా ముందుకు వెళ్లాలనే భావన కలుగుతాయని అదనపు సొలిసి టర్ జనరల్ జూపూడి యజ్ఞదత్ అన్నారు. అమ రావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం నిర్వహించారు. యజ్ఞదత్ మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సమితి చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు ఆర్.లక్ష్మీపతి మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యా పారితోషికాలను అందజేయ డంతో పాటు పేద బ్రాహ్మణ పిల్లలకు ఉచితంగా ఉప నయనాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈసంద ర్భంగా కార్తిక దామోదరునికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, విష్ణు సహస్రనామ పారాయణం కార్యక్రమాల్లో రెండు వేల మంది బ్రాహ్మణ బంధువులు పాల్గొన్నారు. కార్యక్రమం లో బ్రాహ్మణ సేవా సమితి కార్యదర్శి టి. ప్రకాష్, ఉపాధ్యక్షులు ఏ శ్రీధర్, జి.రామకృష్ణారావు, ప్రతిని ధులు కె.బాలకృష్ణ, పాతూరి శ్రీనాథ్, జీవీఎల్ సం జీవరావు, కె. సీతారమేష్, కోదండ రామారావు, కృ ష్ణప్రసాద్, మన్నవ రాధాకృష్ణమూర్తి, ఎం.రామ్‌గో పాల్, డి.ఫణిభూషణ్, ఆర్.వెంకటకృష్ణ, ఆర్.దివా కరశర్మ, మంగాదేవి పాల్గొన్నారు.



జూపూడి యజ్ఞదత్‌ను సత్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు

మసీదుల అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రత్తిపాడు: మసీదులను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుం దని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలాని అన్నారు. వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి, సౌపాడు, చింతపల్లిపాడు, ముట్లూరు, లింగంగుం టపాడు గ్రామాల్లో ఆదివారం జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రెసిడెంట్ జిలానీ ఆధ్వర్యంలో హర్ దిల్ మే వైఎ స్సార్, హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన జిలాని ముస్లిం మత పెద్దలు, సోదరులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులైన వారందరికీ అందుతున్నాయా లేదా అన్న వివరాలను తెలుసుకోవడంతో పాటు, అర్హత ఉం డీ పథకాలు అందని వారు ఎవ్వరైనా ఉంటే పల్లెకు పోదాం కార్యక్రమంలో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముస్లిం లకు రాజకీయంగా తగిన ప్రాధాన్యతనిచ్చి, రాష్ట్ర క్యాబినెట్‌లోనూ అవకాశం కల్పించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సుపరిపాలన సాగి స్తున్నారని గుర్తు చేశారు.

ఉమ్మడి జిల్లాల సదస్సులో ముస్లిం నాయకుడిపై దాడి

పాత గుంటూరు: టీడీపీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాల ముస్లిం నాయకులకు అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. సభలో గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మహ్మద్ నసీర్, రాష్ట్ర నాయకులు మహమ్మద్ నజీర్, టీడీపీ పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర పాల్గొ న్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల వారిగా నాయకులు పలు అంశాలను సభ దృష్టి తీసుకు వచ్చారు. ఈ నేపథ్యంలో తూర్పు నియోజక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బుడేఖాన్ మనువడు టీడీపీ సోషల్ మీడియాలో యాక్టివ్ పర్సన్ ఐన అబ్దుల్ గఫూర్, తూర్పు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై మాట్లాడేందుకు మైక్ అడి గారు. అతడికి మైక్‌ను ఇచ్చేందుకు నసీర్ అహ్మద్ నిరాకరించారు. గఫూర్ ప్రశ్నించడంతో నసీర్ అను చరులు గఫూర్ చొక్కా పట్టుకుని దాడికి యత్నించి నట్లు తెలిసింది. వెంటనే శ్రావణ్‌కుమార్ జోక్యం చేసుకుని నసీర్ వర్గాన్ని బయటికి పంపారు. గతం లో కూడా గఫూర్‌పై నసీర్ వర్గం దాడికి పాల్పడటం తో అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం . అయితే జిల్లా కార్యాలయంలో జరుగుతున్న సమావేశంలో పట్టణ అధ్యక్షుడు డేగల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు సయ్యద్ ఫైరోజ్‌లకు ఆహ్వానం లేక పోవడం పట్ల వారు అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం.

సమాజంలో అందరికీ సమానంగా విద్యావకాశాలు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉర్దూ డీఐ ఖాసిం, హెచ్ఎం విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన అత్యున్నత రాజ్యాంగం ద్వారా సమాజంలో అందరికీ విద్యావకాశాలు సమానం గా దక్కుతున్నాయని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం పేర్కొ న్నారు. ఆదివారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రాజ్యాంగ ఆమోద దినో త్సవం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రప టానికి ఉర్దూ డీఐ ఖాసిం, పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు బి. విజయలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.

అవోపా ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషి యల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆదివారం సంగడి గుంటలోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రం లో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈసందర్భంగా అవోపా ప్రతినిధులు, ఆర్య వైశ్య ప్రముఖులు కుటుంబ సభ్యులతో హాజ రయ్యారు. 50 మంది దంపతులతో సామూ హికంగా శ్రీసత్యనారాయణస్వామి వారి వ్రతం నిర్వహించారు. అనంతరం ఆట, పాట లతో సందడి చేశారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, మహిళా విభాగ చైర్మన్ నిర్మల, గుంటూరు అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి వెచ్చా రాధాకృ ష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాస రావు, చింతా కల్పన, నాళం కృష్ణకుమారి పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మీపురం: జీవన విధానం, అనారోగ్యకరమైన అలవాట్లు దీర్ఘకాలంలో గుండె ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ హరిత అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ గుండె జబ్బుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. శరీరంలో అన్ని అవయవాలలో గుండె ప్రధానమైనదని, పెద్ద వయస్సులో వచ్చే గుండె జబ్బులు కొన్ని సందర్భాల్లో వారి మానసిక అనారోగ్యం వల్ల కూడా సంభవించే అవకాశం ఉందన్నారు. మనం తీసుకునే ఆహారంలో పీచు పదార్థం ఎక్కువగా ఉండేలా చూసుకోవాల న్నారు. గుండెకు సంబంధించిన రక్తనాళాలలో పూడికలు వాతం ఎక్కువగా ఉంటే బైపాస్ సర్జరీ చేస్తారని, తక్కువగా ఉంటే మందులతో చికిత్స చేయవచ్చన్నారు. ఆయిల్ విషయంలో మనం చాలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలీవ్‌ఆయిల్ శ్రేష్టమైనదని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డాక్టర్ హరితను ఘనంగా సత్కరించారు.

మంచి పుస్తకాల ఆవిష్కరణ

నగరంపాలెం: సాహిత్య ప్రమేయం లేని సమాజం అనారోగ్యానికి గురవుతుందని అరసం నేత, ఏఐటీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాల యంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో ఆదివారం మంచి పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. పులుపుల వెంకట శివయ్య గేయాలు– వ్యాసాలు పుస్తకాన్ని ఓబులేసు, తాపీ ధర్మరావు– జీవితం– రచనలను సాహితీవేత్త డాక్టర్ పాపినేని శివశంకర్, కుందుర్తి కవితా ప్రవం తి పుస్తకాలను అరసం రాష్ట్ర కార్యదర్శులు కె.శరత్ చంద్ర, జ్యోతిశ్రీ ఆవిష్కరించారు. సాహితీవేత్త డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ప్రాచీన, ఆధునిక సాహిత్యాలకు వారధి తాపీ ధర్మరావు అన్నారు. నేటితరం సాహిత్యకారులు విధిగా ప్రాచీన సాహిత్యాన్ని కూడా అధ్యాయనం చేయా ల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేటి తరానికి అభ్యుదయ సాహి త్యాన్ని చేరువ చేసేందుకు ప్రచురణలు కొనసాగి స్తూ, డిజిటల్ ఛానెల్ ద్వారా కూడా సాహిత్య కార్య కలపాలను సమాజానికి చేరువ చేస్తున్నామని అన్నారు. సభకు ఏపీ అరసం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అధ్యక్షత వహించగా మాట్లాడారు. అనంతరం ఉమ్మడి జిల్లా అరసం కార్యవర్గాన్ని ప్రకటించగా, గౌరవాధ్యక్షునిగా కారసాని రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడిగా చెరుకుమల్లి సింగా, ఉపాధ్యక్షులుగా డాక్టర్ గొట్టిముక్కల స్వర్ణ లత, గొలి సీతారామయ్య, కనపర్తి బెనహర్ నియ మితులయ్యారు.



మంచి పుస్తకాల ఆవిష్కరణలో ఓబులేసు, శివశంకర్, లక్ష్మీనారాయణ తదితరులు

శివాలయానికి పోటెత్తిన భక్తులు

మంగళగిరి: నగరంలోని గం గా భ్రమరాంబ సమేత మల్లే శ్వరస్వామి దేవస్థానం(శివాల యం) ఆదివారం రాత్రి భక్తు లతో కిటకిటలాడింది. కార్తిక పౌర్ణమి కావడంతో మహిళలు కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి విచ్చేసి కార్తిక దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావ డంతో ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైరపర్సన్ నేరెళ్ల లక్ష్మీపార్వతి, ట్రస్ట్ బోర్డు సభ్యులు అద్దంకి వెంకటే శ్వర్లు, కొల్లి ముసలారెడ్డి, కొల్లి బాబూరావులతో పలువురు ఆలయంలో ఏర్పా ట్లును పర్యవేక్షించగా ఆలయ ప్రధాన అర్చకులు దేవరపల్లి మహేష్ శర్మ పూజలు చేశారు.



శివాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సెల్ఫీల కోసం మహిళల మధ్య ఘర్షణ

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని గాంధీ పార్కులో అదివారం ఫొటోలు(సెల్ఫీలు) తీసు కునే క్రమంలో మహిళల మధ్య వివాదం చోటుచే సుకుంది. ఇటీవల గాంధీ పార్కును పూర్తి స్థాయిలో ఆధునీకీకరించి అక్టోబర్ 6వ తేదీన ప్రారంభించడంతో నగర ప్రజలు వేల సంఖ్యలో పార్కుకు వస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పార్కుకు మరింత రద్దీ పెరిగింది. ఈ క్రమంలో సెల్ఫీ దిగే పాయింటు(వింగ్స్ పాయిం ట్) వద్ద ఫొటోలు దిగే క్రమంలో మహిళల మధ్య వివాదం చోటు చేసుకుంది.

ఈ వివాదం చిలికి చిలికి జుట్టుపట్టు కునే స్థాయికి చేరింది. ఈ తతంగాన్ని అంతా పార్కులోని కొందరు వ్యక్తులు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో హాట్ టాపిక్‌గా మారింది.